సాక్షి ఖమ్మం

గురువారం । 26 । జూన్ । 2025



'కటాఫ్'తో పరిసమాప్తం

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలోని నిబంధనలతో అర్హులైన రైతులకు కేంద్రం నుంచి పెట్టుబడి సాయం అందడం లేదు. 8లో



ఆ'వేతన'లో గోపాలమిత్రలు

పశువులకు వైద్యం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న గోపాలమిత్రలకు తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

అటవీ అభివృద్ధి, సంరక్షణపై ప్రత్యేక దృష్టి



మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

సత్తుపల్లిటౌన్: జిల్లాలో అటవీ అభివృద్ధి, సంరక్షణపై ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ సూచించారు. సత్తుపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన సింగరేణి స్వాధీనంలో ఉన్న అటవీ భూముల లీజ్ నిబంధనలపై సింగరేణి అధికారులతో చర్చించారు. అలాగే, సింగరేణి బొగ్గు గనులు, కిష్టారం, కొమ్మేపల్లి బీట్ పరిధిలోని ప్లాంటేషన్లు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని అటవీ భూములను పరిశీలించారు. అనంతరం చంద్రాయపాలెంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్న అటవీ భూమిని పరిశీలించాక డీఎఫ్‌ఓ మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది అటవీశాఖ ఆధ్వర్యాన 5,47,200 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, సింగరేణి పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, వైల్డ్‌లైఫ్ నిపుణుడు నారాయణ్, ఎఫ్ఎస్‌ఓలు నర్సింహ, నాగరాజు, కొండారెడ్డి, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎరువుల విక్రయం



గోదాంలో ఎరువులను పరిశీలిస్తున్న డీఏఓ

రఘునాథపాలెం: జిల్లాలోని డీలర్లు యూరియా, డీఏపీ అమ్మకాల్లో పారదర్శకత పాటిస్తూ ఎప్పటికప్పుడు వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. అంతేకాక పీఓఎస్ మిషన్ ద్వారానే విక్రయాలు జరపాలని తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల షాప్‌లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డీలర్ల వద్ద రిజిస్టర్ల ఆధారంగా స్టాక్, విక్రయాలను పరిశీలించిన ఆయన సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

నియోనాటల్ వాహనంలో అధునాతన పరికరాలు

నేలకొండపల్లి: అధునాతన పరికరాలతో కూడిన నియోనాటల్ వాహనం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వద్ద బుధవారం నియోనాటల్ వాహనంలో పరికరాల పనితీరుపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ జిల్లాకు తొలిసారిగా ఈ వాహనాన్ని కేటాయించగా అత్యాధునిక పరికరాలు, వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేకంగా నవజాత శిశువుల సంరక్షణకు ఈ వాహనం సమకూర్చారని చెప్పారు. కాగా, 108 అంబులెన్స్‌లు ఖమ్మం జిల్లాలో 21, భద్రాద్రి జిల్లాలో 28 ఉండగా, ఒక్కో వాహనంలో కనీసం నెలకు 120 ట్రిప్పుల ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ అధికారి దుర్గాప్రసాద్, 108 సిబ్బంది అజీమ్, పుష్పలత పాల్గొన్నారు.

పీజీ లాసెట్‌లో 9వ ర్యాంకు

ప్రతిభ చాటిన జిల్లా యువతి భవ్యశ్రీ



యరమల భవ్యశ్రీ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ లాసెట్, పీజీ లాసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పీజీ లాసెట్‌లో ఖమ్మం నగరానికి చెందిన యరమల భవ్యశ్రీ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్ సాధించి సత్తా చాటింది. ఈమేరకు ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఓయూలో ఎల్ఎల్‌బీ చేస్తున్నట్లు వెల్లడించింది. ఉపాధ్యాయుడైన తండ్రి బాలస్వామి, తల్లి నాగేంద్రమ్మతో పాటు కళాశాల అధ్యాపకుల సహకారంతో పీజీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. పేదలకు న్యాయ సాయం అందించాలనేదే లక్ష్యమని వెల్లడించింది. కాగా, భవ్యశ్రీ 1నుంచి 10వ తరగతి వరకు ఖమ్మంలోని కేంద్రియ విద్యాలయంలో, ఇంటర్మీడియట్ పాలేరు నవోదయలో పూర్తిచేసింది.

మరికొద్ది నెలల్లో ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేపై వాహనాలు రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లనున్నాయి. ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వరకు 165 కి.మీ. పొడవుతో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారు. జిల్లాలో రూ.2,214 కోట్లతో మూడు ప్యాకేజీల కింద 105.23 కి.మీ. మేర జాతీయ రహదారి ఉంటుంది. ఇందులో 90శాతం వరకు పనులు పూర్తయ్యాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, ఆర్‌ఓబీలు, కల్వర్టులు, అండర్ పాస్‌ల నిర్మాణం చివరి దశకు చేరింది. వచ్చే మూడు నెలల్లో మిగతా పనులు పూర్తిచేసి జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 365బీజీ)ని అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. కాగా, హైవే నిర్మాణం చాన్నాళ్ల క్రితమే పూర్తి కావాల్సి ఉన్నా మార్గమధ్యలో ధంసలాపురం వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి అనుమతుల ఆలస్యం, ఇతర కారణాలతో జాప్యం జరిగింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఇక దూసుకెళ్లడమే..

తుది దశకు ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

- 90 శాతం పూర్తయిన జాతీయ రహదారి నిర్మాణం
- ధంసలాపురం వద్ద నిర్మాణంలో ఆర్‌ఓబీ
- మూడు నెలల్లో హైవేను అందుబాటులోకి తెచ్చేలా వేగం



వేంసూరు - పెనుబల్లి మధ్య సిద్ధమైన హైవే

అవాంతరాల నడుమ..

ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారి నిర్మాణం భూసేకరణ, పలు శాఖల నుంచి అనుమతులు, సాంకేతిక సమస్యలతో ఆలస్యమైంది. ప్యాకేజీ-1 లో 221 హెక్టార్ల భూమి మ్యుటేషన్‌లో జాప్యం జరి గింది. ప్యాకేజీ-2లో కూడా చిన్నచిన్న సమస్యలతో జాప్యం చోటుచేసుకుంది. ఈ అవాంతరాలన్నీ అధి గమిస్తూ అధికారులు ముందుకు సాగారు. మరో వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే కావడంతో ఎగ్జిట్ల కోసం పలు చోట్ల స్థానికులు పట్టుబట్టారు. జిల్లాలో ఏడు ఎగ్జిట్లు ఇచ్చినా.. మరికొన్నింటికి డిమాండ్ పెరిగింది.

మూడు నెలల్లో..

మరో మూడు నెలల్లో ఖమ్మం నుంచి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వాహనాలు దూసుకెళ్లనున్నాయి. మిగిలిన రహదారితో పాటు బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్లు సహా ఇతర పనులను మూడు నెలల వ్యవధిలో పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీంతో ఆగస్టు చివరకల్లా లేదంటే సెప్టెంబర్‌లో హైవే అందుబాటులోకి రానుండగా... ఖమ్మం కొత్తరూపు సంతరించుకోనుంది.

మూడు ప్యాకేజీల్లో హైవే..

ప్యాకేజీ	ఎక్కడి నుంచి ఎక్కడికి	వ్యయం	నిడివి
01	తల్లంపాడు - సోమవరం	రూ.1,062.74 కోట్లు	33.604 కి.మీ.
02	సోమవరం - చింతగూడెం	రూ.761.73 కోట్లు	29.51 కి.మీ.
03	చింతగూడెం - రేచర్ల	రూ.948.64 కోట్లు	26.95 కి.మీ.

హైవే మార్గంలో బ్రిడ్జిలు, ఇతర నిర్మాణాల పరిస్థితి

నిర్మాణాలు	ప్రతిపాదన	పూర్తి	నిర్మాణంలో ఉన్నవి
పెద్ద బ్రిడ్జిలు	8	5	3
చిన్న బ్రిడ్జిలు	35	33	2
వీయూపీ	20	16	4
ఎల్‌వీయూపీ	8	8	0
ఎస్‌వీయూపీ	50	45	5
పీయూపీ	30	29	1
ఫ్లై ఓవర్లు	7	5	2
మొత్తం	158	141	17

వీయూపీ : వెహికిల్ అండర్ పాస్, ఎల్‌వీయూపీ : లైట్ వెహికిల్ అండర్‌పాస్, ఎస్‌వీయూపీ : స్మాల్ వెహికిల్ అండర్‌పాస్, పీయూపీ : పాదచారుల అండర్‌పాస్

90 కి.మీ. పూర్తి

జాతీయ రహదారి పనులు చివరి దశకు చేరాయి. జిల్లాలో 105.23 కిలోమీటర్లకు గాను ఇప్పటివరకు 90 కి.మీ. మేర నిర్మాణం పూర్తయింది. మరో 15 కిలోమీటర్ల రహదారి కూడా చివరి దశలో ఉంది. హైవేపై కల్వర్టులు, ఫ్లై ఓవర్లు, చిన్నాపెద్ద బ్రిడ్జిలు, వాహనాలు, పాదచారుల అండర్ పాస్‌లతోపాటు ఖమ్మంలోని ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి చివరి దశలో ఉన్నాయి. వీటితోపాటు 191 కల్వర్టులకు గాను 188 పూర్తయ్యాయి. అలాగే, బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్లు 158లో 141 పూర్తికాగా, మిగిలినవి తుది దశకు చేరాయి.



ధంసలాపురం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

పరిశుభ్రమైన నగరమే లక్ష్యం

- సిబ్బందికి ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం అర్బన్ : మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ తదితరులు

ఖమ్మం అర్బన్: పరిశుభ్రత, తద్వారా ఆరోగ్యవంతమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దడంలో అందరూ సహకరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం 11వ డివిజన్ వరదయ్యనగర్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో పాల్గొన్న మంత్రి డ్రెయిన్‌లో మురుగు తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇరవై రోజుల నుంచి నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నందున ప్రజలు కూడా రోడ్ల వెంట, డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా సిబ్బందికి సహకరించాలని తెలిపారు. నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం సొంతమవుతుందని చెప్పారు. అనంతరం 4వ డివిజన్ రాజీవ్‌నగర్ గుట్టలో రూ.50 లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పేదలు నివాసముంటున్న ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడగా వరదయ్యనగర్‌లో మంత్రి సహా అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఈఈలు వి.రంజిత్, కృష్ణలాల్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, అటవీశాఖ అధికారి బెల్లం రాధిక, కార్పొరేటర్లు సరిపూడి రమాసతీష్, దండాజ్యోతిరెడ్డి, కమర్తపు మురళి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా మాధురినారాయణరావు, సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబుతో పాటు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు తాతా రఘురాం, కీసర పద్మజారెడ్డి, బోడా శ్రావణ్‌కుమార్, సాధు రమేష్‌రెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, పల్లెబోయిన చంద్రయ్య, లోడుగు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



వేంసూరు : అడసర్లపాడులో డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నాగేశ్వరరావు

రైతుల అభివృద్ధి కోసమే బ్యాంకు

వేంసూరు: పంటలతో పాటు ఇతర అవసరాలకు రుణాలు ఇస్తూ రైతులకు డీసీసీబీ ద్వారా సహకారం అందించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వేంసూరు మండలం అడసర్లపాడు, కందుకూరు గ్రామాల్లో డీసీసీబీ బ్రాంచ్‌లను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు రుణమాఫీ చేయడమే కాక వరి నాట్లకు ముందే రైతుభరోసా నిధులు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆర్డీఓ రాజేంద్రగౌడ్, డీసీసీబీ డీజీఎంలు వేణుగోపాల్‌రావు, సర్వేశ్వరరావు, ఏజీఎం చందురావు, మేనేజర్లు నాగలక్ష్మి, రజిత, అలీమ్, నాయకులు వెల్ది జగన్‌మోహన్‌రావు, గొర్ల సంజీవరెడ్డి, ఎం.డీ.ఫైజుద్దీన్, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి పోటీలు



మెడిసిన్ బాల్ త్రో విసురుతున్న విద్యార్థి

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేందుకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీలకు 40 మంది బాలురు, 15 మంది బాలికలు హాజరయ్యారు. పరుగు పందెం, మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ బ్రాండ్ జంప్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించడమే కాక ఎత్తు, బరువు పరీక్షించారు. ఇందులో 10మంది చొప్పున బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జూలై 3వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారు. పోటీలను డీవైఎస్‌ఓ తుంబూరు సునీల్‌రెడ్డి పర్యవేక్షించగా మేనేజర్ ఉదయ్‌కుమార్, శాప్ పరిశీలకులు బి.రాంబాబు, కోచ్‌లు ఎం.డీ.గౌస్, పరిపూర్ణాచారి, చంద్రకాంత్, కైలాష్, నగేష్, సిరి పాల్గొన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం



పెద్దాస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ

- జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వందనంలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

చింతకాని: పచ్చదనాన్ని పెంపొందించేలా వచ్చేనెల 1నుంచి వన మహోత్సవం నిర్వహించనుండగా లక్ష్యం మేర నాటేందుకు మొక్కలు సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. చింతకాని మండలం వందనంలోని నర్సరీని బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడంతో పాటు వంద శాతం సంరక్షించడం ద్వారా జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని తెలిపారు. ప్రతీ శాఖకు కేటాయించిన లక్ష్యం మేర రెండు మీటర్ల కంటే ఎత్తు ఉన్న మొక్కలు నాటాలని, ప్రతీ మొక్కను జియోట్యాగ్ చేసి పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ వందనంలోని స్వయంభూ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. డీఆర్డీఓ సన్యాసయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత స్థానం

చదువుతోనే ఉన్నత స్థాయికి చేరొచ్చని, తద్వారా సమాజంలో గౌరవం లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. వందనంలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసిన ఆయన పరిసరాలు, టాయిలెట్లు, వంటగదితో పాటు 1, 5వ తరగతుల్లో బోధనను పరిశీలించారు. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపడాలి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. వేతనాలు అందక ఆస్పత్రి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన నేపథ్యాన కలెక్టర్ బుధవారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్యంపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాని వైద్యులకు సూచించారు. ఫార్మసీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, మెనూ ప్రకారం రుచి, శుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ రాంప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

కార్డుల్లో అనర్హుల పేర్లు తొలగించుకోండి

ఖమ్మం సహకారనగర్: రేషన్‌కార్డు లబ్ధిదారుల్లో ఎవరైనా మృతి చెందినా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడినా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో సమాచారం ఇచ్చి పేర్లు తొలగించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ సూచించారు. అలాకాకుండా వారి పేర్లపై బియ్యం తీసుకున్నట్లు తేలితే నిత్యావసర వస్తువుల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఖమ్మం అర్బన్ మండలం దానవాయిగూడెంలో విచారణ జరపగా కొందరు కుటుంబ సభ్యులు మరణించినా వారి పేర్లు తొలగించకుండా బియ్యం తీసుకుంటున్నారని తేలిందన్నారు. ఇంకోచోట లబ్ధిదారుడు మృతి చెందగా, ఓటీపీ ద్వారా బియ్యం తీసుకున్నట్లు గుర్తించామని, ఇలాంటి వారు ఇకనైనా పేర్లు తొలగించుకోవాలని డీసీఎస్‌ఓ ఓ ప్రకటనలో సూచించారు.

సీఐ మెడకు.. ఎన్‌ఆర్‌ఐ కేసు

- ఇల్లెందు సీఐ సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ

ఇల్లెందు: ఓ ఎన్‌ఆర్‌ఐ దంపతుల మధ్య ఏర్పడిన వివాదం.. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ సస్పెన్షన్‌కు దారి తీసింది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తమతో సీఐ దురుసుగా ప్రవర్తించారని ఎన్‌ఆర్‌ఐ నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా.. సీఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లెందు కరెంటాఫీస్ ఏరియాకు చెందిన పి.నవీన్‌రెడ్డికి హైదరాబాద్‌లోని శంగిచెర్లకు చెందిన శ్రావ్యతో 2023 జూన్‌లో వివాహం జరిగింది. కొంతకాలం అమెరికాలోని డల్లాస్‌లో కాపురం సాగించాక హోం సిక్ పేరుతో ఇంటికి వచ్చిన శ్రావ్య తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఏడాది గడిచినా నవీన్‌రెడ్డి శ్రావ్యను తీసుకెళ్లకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఈనెల 19న ఇల్లెందు పోలీసులను ఆశ్రయించగా సీఐ సత్యనారాయణ, షీటీం సభ్యులు వివాదాన్ని పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈక్రమాన స్టేషన్‌కు పిలిచి శ్రావ్య కుటుంబీకుల సమక్షాన సీఐ బెదిరించారని నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు ఉప్పల్‌రెడ్డి, పద్మజ ఐజీకి ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం సస్పెండ్ చేశారు.

ఖమ్మం అడిషనల్ డీసీపీ విచారణ..

సీఐ సత్యనారాయణపై ఫిర్యాదు అందగా ఐజీ ఆదేశాల మేరకు ఖమ్మం అడిషనల్ డీసీపీ ప్రసాదరావు బుధవారం ఇల్లెందు పీఎస్‌లో విచారణ నిర్వహించారు. నవీన్‌రెడ్డి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచిన సమయాన సీసీ ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ఆరోజు విధుల్లో ఉన్న సిబ్బందిని విచారించారు.

పోస్టింగ్ కోసం అంతర్గత పోరు..

ఇల్లెందు సీఐ మార్పు జరుగుతుందని కొంతకాలంగా ప్రచారం జోరందుకుంది. ఇదే సబ్ డివిజన్‌కు చెందిన ఓ అధికారి ఈ స్థానంపై కన్నేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతలోనే ఎన్‌ఆర్‌ఐ కేసు తెరపైకి రావడం, ఆయన తల్లిదండ్రులను సీఐ విచారణ పేరిట ఇబ్బంది పెట్టారని ఐజీకి ఫిర్యాదు చేయడం, ఆతర్వాత సీఐపై సస్పెన్షన్ వేటు పడడం చర్చనీయాంశంగా మారింది.

వరుణుడి కటాక్షం

- జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వాన
- ఊపందుకోనున్న పంటల సాగు



కారేపల్లి : పత్తి చేనులో పాటు చేస్తున్న రైతు

ఖమ్మంవ్యవసాయం: ఎట్టకేలకు వరుణుడు కటాక్షించాడు. ఈనెల 22వ తేదీన ఆరుద్ర కార్తె ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు తగ్గడమే కాక ఆకాశం మేఘావృతమవుతోంది. ఇందులో భాగంగానే మూడు రోజుల నుంచి జిల్లాలోని పలుచోట్ల వర్షపు జల్లులు, అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఇక బుధవారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా వర్షం మొదలైంది. సాయంత్రం 4గంటలకు ఓ మోస్తరుగా మొదలైన వాన అంతకంతకూ పెరుగుతూ రాత్రి వరకు కొనసాగింది. రాత్రి 7గంటలకు వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం అత్యధికంగా వేంసూరులో 54.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, సదాశివునిపాలెంలో 38.5, వైరాలో 38, గుబ్బగుర్తిలో 35.5, కుర్నవల్లిలో 33.5, ఖమ్మం ఖానాపురం, రావినూతలో 30.5, బచ్చోడులో 29, పల్లెగూడెంలో 28, సత్తుపల్లిలో 26.8, కొణిజర్ల 26.5, ఖమ్మం కలెక్టరేట్ వద్ద 26.3, తిరుమలాయపాలెంలో 25, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 24.8, పెనుబల్లిలో 24.3, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ వద్ద 23.5, రఘునాథపాలెంలో 21.8, తల్లాడ 20.5 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తోంది.



తల్లాడ : వర్షంతో కళకళలాడుతున్న పత్తి పైరు

పంటల సాగుకు దోహదం

ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటల సాగుకు దోహదపడుతుంది. మెట్ట పంటలను విత్తుకునేందుకు 60 – 70 మి.మీ.ల వర్షపాతం అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, మే చివరి వారం రోహిణి కార్తె ఆరంభంలో వర్షం కురవగా, రైతులు పత్తి, పెసర, కంది, మొక్కజొన్న విత్తారు. కానీ జూన్ ఆరంభం నుంచి వానలు లేకపోగా ఆశించిన మేర విత్తనాలు మొలకెత్తలేదు. ప్రస్తుతం కురుస్తున్న వాన పంటల సాగుకు దోహదపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

పత్తిని మళ్లీ విత్తాల్సిందేనా?

జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పంటల్లో పత్తి ఒకటి. ఈ పంట జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే 2లక్షల ఎకరాల్లో నాటినట్లు తెలుస్తుండగా.. సరిపడా వర్షం లేక చాలాచోట్ల పూర్తి స్థాయిలో మొలకెత్తలేదు. మొలకెత్తని చోట తిరిగి మరోమారు పత్తి విత్తనాలు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వచ్చేనెల 20వరకు పత్తి విత్తనాలు వేసే అవకాశమున్నందున రైతులు ముందడుగు వేస్తున్నారు. ఇక గత ఏడాది మిర్చి దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు పత్తి వైపే దృష్టి సారించారు. ఇంకొందరు మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో ఈటల పర్యటన

ఖమ్మంమామిళ్లగూడెం: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంలో మధ్యాహ్నం రెండు గంటలకు మొదలయ్యే చైతన్య సభలో ఆయన పాల్గొంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడతారని, అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు కూసుమంచిలో జరిగే సభలో పాల్గొంటారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు హాజరు కావాలని కోరారు. ఈటలతో పాటు ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ కూడా పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మంరాపర్తినగర్: ప్రైవేట్ రంగంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ నెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, భారతి హ్యుండాయ్ కంపెనీల బాధ్యులు పాల్గొని అర్హులను ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, ట్రెయినీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, భారతి హ్యుండాయ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్ ఉద్యోగాలకు 18 – 35 ఏళ్ల వయస్సు కలిగి అర్హతలు ఉన్నవారు హాజరుకావొచ్చని తెలిపారు. విద్యార్హతలు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్‌తో 27న ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సెర్ప్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ షురూ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ (డీఆర్‌డీఏ)లో సెర్ప్ విభాగం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఏళ్లుగా ఒకే జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు రాష్ట్ర అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇటీవలే అడిషనల్ డీఆర్‌డీఓల బదిలీ పూర్తి కాగా.. డీపీఎంల బదిలీలకు కౌన్సెలింగ్ సెర్ప్ కార్యాలయంలో కొనసాగుతోంది. ఈ మేరకు డీపీఎం దర్గయ్య ఇతర జిల్లాకు, సూర్యాపేట నుంచి డీపీఎంలు ఆంజనేయులు, లక్ష్మీనారాయణ ఖమ్మంకు బదిలీ అయినట్లు తెలిసింది. గురు వారం వరకు డీపీఎంల బదిలీల ప్రక్రియ జరగనుండగా, ఆ తర్వాత ఏపీఎంలు, సీసీల బదిలీల కౌన్సెలింగ్ మొదలు పెడతారని సమాచారం.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

వేంసూరు: మండలంలోని భీరపల్లికి చెందిన వృద్ధురాలు పుచ్చకాయల వెంకటనర్సమ్మ మెడలో నుంచి రూ.50 వేల విలువైన బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. ఆమె మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉండగా బైక్‌పై వచ్చిన దుండగులు గొలుసు లాక్కుని పారిపోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘కటాఫ్’తో పరిసమాప్తం

- రైతులందరికీ అందని ‘పీఎం కిసాన్ సమ్మాన్ నిధి’
- కటాఫ్ డేట్ పేరుతో జాబితాలో దక్కని చోటు
- ఏటా రూ.6 వేలు కోల్పోతున్న అన్నదాతలు



పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తులు ఇస్తున్న రైతులు (ఫైల్)

ఎర్రుపాలెం: దేశవ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులకు పంటల సాగు పెట్టుబడిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అర్హులందరికీ లబ్ధి జరగడం లేదు. కటాఫ్ డేట్ నిబంధనతో లక్షల మంది రైతులు ఈ పథకానికి దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019 జనవరి 31వ తేదీలోపు పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన రైతులకు ఏటా మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు ఆర్థికసాయం అందిస్తోంది. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, చార్టెడ్ అకౌంటెంట్లు, వైద్యులు, రాజ్యాంగపదవిలో కొనసాగుతున్న ప్రజా ప్రతినిధులు తదితరులను ఈ పథకం ఆరంభం నుంచి అనర్హులుగా తేల్చారు. జిల్లాలో మొదటి విడతగా 1.94 లక్షల మంది రైతులకు ఆర్థికసాయం జమ చేయగా, ఆపై విడతల వారీగా అనర్హులను గుర్తిస్తుండడంతో నేడు ఆ సంఖ్య 1.04 లక్షలుగా ఉంది.

ఇంకా 2.50 లక్షల మందికి పైగానే

2019 ఫిబ్రవరి నుంచి భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకున్న 2.50 లక్షల మంది సన్న చిన్న కారు రైతులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందడం లేదు. కటాఫ్ డేట్ నిబంధన కారణంగానే వీరంతా నష్టపోతున్నట్లు చెబుతున్నారు. 2019 నాటికి పథకం ద్వారా నగదు తీసుకుంటున్న రైతుల్లో ఎవరైనా చనిపోతే వారి వారసులకు మాత్రం సాయం అందుతోంది. అంతేతప్ప కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పాస్‌పుస్తకాలు తీసుకున్న రైతులకు మాత్రం లబ్ధి జరగడం లేదు. దీంతో 2019 ఫిబ్రవరి తర్వాత భూములు కొనుగోలు చేసిన రైతులు పాస్‌పుస్తకాలతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి స్కీం సాయం కోసం మీ సేవా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవడం, ఏఈఓల లాగిన్‌కు వెళ్లగానే తిరస్కరించడం పరిపాటిగా మారింది. ఫిబ్రవరిలో 1.04 లక్షల మంది రైతులకు 19వ విడత ఆర్థికసాయం అందింది. ఇక జూన్‌లోనే 20వ విడత ఆర్థికసాయం జమ కావాల్సి ఉన్నా ఇంకా జరగలేదు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ద్వారా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు కొత్త పట్టాదారుపాస్ పుస్తకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలోనూ అర్హులకు పాస్‌పుస్తకాలు జారీ చేస్తే పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో అర్హుల సంఖ్య పెరగనుంది. అయితే, ఈ పథకం నిబంధనల ప్రకారం ప్రతీ ఐదేళ్లకోసారి తిరిగి కొత్త రైతులను గుర్తించి కటాఫ్ డేట్ నిర్దేశించాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అర్హులైన లక్షలాది మంది పెట్టుబడి సాయం కోల్పోతున్నారు.

మేమేం పాపం చేశాం..

2019 తర్వాత భూములు కొనుగోలుచేసిన చేసిన రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి సాయం అందకపోవడంతో తామేం పాపం చేశామని వాపోతున్నారు. కటాఫ్ డేట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తమను విస్మరించడంపై ఆవేదన చెందుతున్నారు. ఆరేళ్లలో ఏటా రూ.6 వేల ఆర్థికసాయం కోల్పోతున్న తమను ఇకనైనా పరిగణనలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పథకం నిబంధనల మేరకు ఐదేళ్లకోసారి కొత్త రైతులను గుర్తించాల్సి ఉన్నందున అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సాయం చేయకపోతే ఎలా?



ఇనగాలిలో మూడేళ్ల క్రితం అర ఎకరం భూమి కొనుగోలు చేశా. కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం కోసం ఏఈఓను అడిగితే కటాఫ్ డేట్ ప్రకారం సాయం రాదని చెబుతున్నారు. మాలాంటి పేద రైతులకు నిబంధనల పేరిట అన్యాయం చేయడం సరికాదు. –శ్రీపాలశెట్టి శ్రీనివాసరావు, రైతు, ఎర్రుపాలెం

మాకూ వర్తింపజేయాలి



నాకు మోటమర్రి గ్రామంలో 16 కుంటల భూమి ఉంది. సన్నకారు రైతుల కోసం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ స్కీం ద్వారా మాకు కూడా సాయం అందించాలి. కటాఫ్ డేట్‌ను తొలగించడం ద్వారా పేద రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. –వంగల గోపి, రైతు, మోటమర్రి, బోనకల్, మండలం

విధివిధానాలు రాలేదు..



ఈ పథకంలో 2019 సంవత్సరం కటాఫ్ డేట్‌గా ఉంది. దీనిని సవరిస్తేనే కొత్త రైతులకు పెట్టుబడి సాయం జమ అవుతుంది. అంతేకాక ప్రతీ ఐదేళ్లకోసారి అర్హులైన కొత్త రైతులను గుర్తించాల్సి ఉంటుంది. కానీ వీటి అమలుపై విధివిధానాలు జారీ కాలేదు. –ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మంసహకారనగర్: గత ఏడాది మాదిరి వరదలు వస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి విపత్తుల నిర్వహణపై బుధవారం ఆయన సమీక్షించారు. గతంలో ముంపునకు గురైన ప్రతీ హ్యాబిటేషన్‌లో పరిశీలించి మళ్లీ వరద వస్తే ఎక్కడకు తరలించాలనే అంశంపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసేలా కంట్రోల్ రూమ్ సిద్ధం చేయాలని, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో నీటి వనరుల్లో చేరే వరదను గమనిస్తుండాలని చెప్పారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ.. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు కీలకమని తెలిపారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడగా డీఆర్వో ఎ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఇసుక

ఖమ్మంఅర్బన్: జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో మైనింగ్, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి, ప్రాధాన్యత కార్యక్రమాలకు ఇసుక కొరత రాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. టీజీఎండీసీ ఆధ్వర్యాన ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలో సాండ్ బజార్ ఏర్పాటు చేసినట్లుగానే మధిర మార్కెట్ యార్డు, పాలేరు తహసీల్, కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయం, సత్తుపల్లి మార్కెట్లలోనూ ఏర్పాటు చేయాలని చెప్పారు. వీటి నిర్వహణను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించి పర్యవేక్షించాలని సూచించారు. మైన్స్ ఏడీ సాయినాథ్, టీజీఎండీసీ పీఓ జి.శంకర్‌నాయక్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఎస్‌ఈలు యాకూబ్, ఎం.వెంకటేశ్వర్లు, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఈఈలు రంజిత్, వాణిశ్రీ పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంఅర్బన్: సమాజంలో నుంచి టీబీ సమూలంగా నిర్మూలించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ఖమ్మం కైకొండాయిగూడెంలో గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశం నుంచి 2025 నాటికి టీబీని తరిమికొట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఏ కొంచెం అనుమానం ఉన్నా.. పరీక్ష చేయించుకుని చికిత్స పొందాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయడమే కాక మందులు ఇస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనికరం లేని కుమారులు

- కుంట స్థలం కోసం తల్లిని గెంటేసిన వైనం
- జీవనభృతి చెల్లిస్తూ, ఇల్లు అప్పగించాలని ఆర్‌డీఓ కోర్టు తీర్పు

కల్లూరు: మండలంలోని రావికంపాడుకు చెందిన 85 ఏళ్ల వృద్ధురాలైన తల్లిని కుమారులు గెంటేయగా.. ఆమెకు సంరక్షణ, జీవనభృతి కింద నెలనెలా నగదు చెల్లించాలని కల్లూరు ఆర్డీఓ సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. గ్రామానికి చెందిన తేనే నాగమ్మ ఒంటరిగా కుంట స్థలంలోని ఇంట్లో నివాసముంటోంది. ఆమె భర్త లక్ష్మయ్య పదిహేనేళ్ల క్రితమే మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ రూ.2వేలు, రేషన్ బియ్యంతో జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుల్లో తేనే జగన్నాథరావు, వెంకటేశ్వరరావు తల్లి ఉంటున్న ఇంటి స్థలం కాజేయాలని గత నెల 28న బయటకు గెంటేశారు. దీంతో నిరాశ్రయురాలై నాగమ్మ కల్లూరు ఆర్‌డీఓ రాజేందర్‌ను కలవగా ఆయన విచారణ చేపట్టారు. నాగమ్మ ఆరుగురు కుమారులకు నోటీసులు ఇవ్వడమే కాక ఆమెకు ప్రతీనెల 10వ తేదీలోగా సంరక్షణ, జీవనభృతి కింద రూ.వెయ్యి ఇవ్వాలని, తాళం వేసిన ఇంటిని అప్పగించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను అమలు చేసే బాధ్యత తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎస్‌ఐ హరితకు అప్పగించారు. కాగా, 2007 సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ చట్టం ప్రకారం ఈ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంకితభావంతో కృషి చేయాలి..



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

వైరా: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడమే ధ్యేయంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పలు ప్రభు త్వ పాఠశాలలను బుధవారం సందర్శించిన యూనియన్ నాయకులు సభ్య త్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నాయకత్వాన పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని తెలిపారు. అలాగే, ఉపాధ్యాయుల జీపీఎఫ్ పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. యూనియన్ నాయకులు డి.సత్యనారాయణ, వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎన్.జాన్, కారుమంచి దయాకర్, సుజాత, చంద్రశేఖరరెడ్డి, రమేశ్, సురేశ్, రవికుమార్, ప్రభాకర్, పుల్లారావు, రాఘవరావు పాల్గొన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీ అత్యంత ప్రమాదం

- వాజ్‌పేయి, మోదీ అధికారానికి చంద్రబాబే కారణం
- రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి



మాట్లాడుతున్న తెలకపల్లి రవి, వేదికపై నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని రాజకీయ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి పేర్కొన్నారు. ప్రకటిత ఎమర్జెన్సీ కంటే అప్రకటిత ఎమర్జెన్సీ అత్యంత ప్రమాదకరమని, నాటి ఎమర్జెన్సీని వ్యతిరేకించిన ఏకైక పార్టీ సీపీఎం అని చెప్పారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో బుధవారం ‘ఎమర్జెన్సీకి 50 ఏళ్లు – నేటి నయా ఫాసిస్ట్ ప్రమాదం’, ‘నేటి ప్రజాస్వామ్యం – సవాళ్లు’అంశాలపై నిర్వహించిన సెమినార్‌లో రవి మాట్లాడారు. ప్రస్తుతం రాజ్యాంగం తీవ్ర స్థాయిలో అణచివేతకు గురవుతోందని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సూత్రాలపై ప్రస్తుత దాడి ప్రమాదకరమైందని, నిరంకుశత్వం వ్యవస్థీకృతం కావడానికి ఇది దారి తీసిందన్నారు. అంతేకాక దేశం అన్న భావనే తలకిందులు చేసేలా విషపూరితంగా హిందుత్వ విధానాలను జొప్పిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పాలన వ్యవస్థను తొలగించడం కష్టంగా అనిపించినా, 1970 ఎమర్జెన్సీపై పోరాడిన అనుభవం గుర్తు చేసుకుంటే విశ్వాసమే కనిపిస్తుందని చెప్పారు. కాగా, గతంలో వాజ్‌పేయి రెండుసార్లు, ఇప్పుడు మోదీ అధికారంలో ఉన్నారంటే చంద్రబాబు బలపర్చడమే కారణమని ఆయన పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితి విధించినప్పుడు కాంగ్రెస్ పాలకులు ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారని, ప్రస్తుతం బీజేపీ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడినట్లుగానే నేడు బీజేపీ అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రం, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొణిజర్ల మండలంలో యూనియన్ సభ్యత్వ నమోదును బుధవారం ప్రారంభించగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస తులు లేక విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోందని తెలిపారు. కాగా, ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి టీఎస్ యూటీఎఫ్ కృషి చేస్తోందని, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరు, పీఆర్‌సీ తదితర సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిలుకూరి వీరస్వామి, మద్దెల ప్రసాదరావుతో పాటు రత్న సుశీలరాణి, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, మోహినుద్దీన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆవేతనలో గోపాలమిత్రలు..

- 9 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు
- అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్న వైనం
- జీవాలకు చికిత్స చేసేలా 2000 సంవత్సరంలో నియామకం



వైద్యశిబిరంలో రైతులకు మందులు అందజేస్తున్న గోపాలమిత్ర (ఫైల్)

నేలకొండపల్లి: మేలు రకం పశువుల సంతతి పెంచడమే లక్ష్యంగా కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డాల్డా) అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 2000 సంవత్సరంలో రాష్ట్రంలోనే మొదటిసారి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో గోపాలమిత్ర వ్యవస్థను ప్రారంభించారు. తొలుత జిల్లాలో నలుగురికి శిక్షణ ఇచ్చి కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 255 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది గానీ వీరికి గతేడాది సెప్టెంబర్ నుంచి గౌరవ వేతనం అందక అర్ధాకలితో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

విధులు ఇలా..

గోపాలమిత్రలకు పలు రకాల విధులను అప్పగించారు. కృత్రిమ గర్భధారణ కోసం మేలు రకం జాతి పశువుల వీర్యాన్ని సేకరించి పశువులకు ఇవ్వడం ప్రధాన విధి. అంతేకాక పాల దిగుబడి పెరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అలాగే, జీవాలకు క్షేత్రస్థాయిలోనే ప్రథమ చికిత్స చేయాలి. ఈ కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తుండడంతో విడతలుగా వీరి గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పెంచుతూ వస్తోంది. ప్రస్తుతం నెలకు రూ.11,050 అందుతుండగా.. గతేడాది ఆగస్టులో చివరిసారిగా వేతనాలు జమ అయ్యాయి. ఆ తర్వాత సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందకపోవడం గమనార్హం. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో గోపాలమిత్రలకు దాదాపు రూ.2.60 కోట్ల మేర బకాయి ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో గోపాలమిత్రలు కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు.

లక్ష్యం చేరకపోతే వేతనంలో కోత

నిర్దేశిత సంఖ్యలో పశువులకు కృత్రిమ గర్భధారణ కోసం గోపాలమిత్రలు ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతీనెలా తమ పరిధిలో 80 – 100 పశువులకు చేయాలనేది లక్ష్యం. ఇందుకోసం రైతుల నుంచి ప్రతీ పశువుకు రూ.40 చొప్పున వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలి. అయితే, లక్ష్యం మేరకు చేయకపోతే ఎన్ని పశువులు తగ్గుతాయే అంత మేర గోపాలమిత్రల వేతనం నుంచి మినహాయిస్తున్నారు. ఇచ్చేదే అరకొర వేతనం కాగా, ఆపై లక్ష్యాల పేరిట కోత విధిస్తుండడం, ఇప్పుడు తొమ్మిది నెలలుగా అసలు వేతనాలు చెల్లించకపోవడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది.

బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలి



సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారింది. తొమ్మిది నెలలుగా వేతనాలు రాక అవస్థ పడుతున్నాం. కనీసం బైక్ పెట్రోల్ ఖర్చులకూ ఇబ్బందిగా ఉంది. ఇకనైనా పెండింగ్ వేతనాలు విడుదల చేయడమే కాక నెలనెలా వేతనాలు చెల్లించాలి. –బోయపాటి నారాయణ, గోపామిత్రల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

గోపాలమిత్రల వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రతీనెలా మా కార్యాలయం నుంచి ప్రతిపాదనలు పంపుతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదల అవుతాయని అనుకుంటున్నాం. నిధులు రాగానే చెల్లింపులు చేపడుతాం. –రూప్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సాయికుమార్ (ఫైల్)

కామేపల్లి/కారేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన వాంకుడోత్ సాయికుమార్ (22) తన స్నేహితుడైన భూక్యా కుమార్‌తో కలిసి పనినిమిత్తం బైక్‌పై మంగళవారం ఖమ్మం వెళ్లారు. తిరిగి రాత్రి బైక్‌పై వస్తుండగా కామేపల్లి మండలం మద్రిగూడెం స్టేజీ సమీపాన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ వాహనం సాయి కుమార్ పొట్ట మీదుగా వెళ్లడంతో పొట్టభాగం నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడిన కుమార్‌ను స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: చెల్లించాల్సిన అప్పు కింద ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో మూడు నెలలు జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం పాకబండబజార్‌కు చెందిన తనుకు వెంకటేశ్వర్లు వద్ద చిట్టుమొదు వెంకటేశ్వర్లు 2022 జనవరిలో రూ.3.20లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2022 జూలైలో చెక్కు ఇవ్వగా, తనుకు వెంకటేశ్వర్లు బ్యాంకు ఖాతాలో జమ చేస్తే చిట్టుమొదు వెంకటేశ్వర్లు ఖాతాలో సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురైంది. దీంతో బాధితుడు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా విచారణ అనంతరం జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.3.20 లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

ముదిగొండ: ఖమ్మం – కోదాడ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. నేలకొండపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆటోకు ముదిగొండ సమీపాన జాతీయ రహదారిపై కుక్క అడ్డొచ్చింది. దీంతో అదుపు తప్పిన ఆటో పల్టీకొట్టగా డ్రైవర్ సాయికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.